www.prajapakasham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 12 | అక్టోబర్ | 2026
పేజీలు : 8

## ఖమ్మం గడ్డపై కొలువుదీరనున్న తిరుమలేశుడు



-20 ఎకరాల విస్తీర్ణంలో టిటిడి దివ్యక్షేత్రం
-ఆధ్యాత్మిక నగరంగా ఖమ్మం
-నేడు ఆలయ నిర్మాణానికి భూమిపూజ
-సకల జనులు హాజరు కావాలి : మంత్రి తుమ్మల

8లో..

# ఇలా అయితే బతికేదెలా...?

### అదుపులేని ధరలు.. అదరగొడుతున్న ఎండలు





-నింగికి చేరిన నిత్యావసరాలు

-వాతావరణం మార్పులతో ప్రబలుతున్న వ్యాధులు

ప్రజాపక్షం/ఖమ్మం : భిన్న పరిస్థితుల మధ్య పేద, మధ్యతరగతి ప్రజలు బతకలేని పరిస్థితి ఏర్పడింది. పాలకుల వైఫల్యం సానుకూలంగా లేని ప్రకృతి నడుమ ఈ పరిస్థితి దాపురించింది. పాలకులు పేద, సామాన్య ప్రజలను వదిలి సంపన్నుల కొప్పు కాస్తున్న వేళ ప్రకృతి సైతం ప్రజలపై తన ప్రకోపాన్ని ప్రదర్శిస్తుంది. పాలకులు ధరలను అదుపుచేయలేని కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు నింగిని తాకుతున్నాయి.

మిగతా 2లో..

## బాబూజీ సేవలు చిరస్మరణీయం

సత్తుపల్లిలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాబూజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి తుమ్మల

2లో



### జూన్ నాటికి ఇంటిగ్రేటెడ్ స్కూల్

## అందుబాటులోకి రావాలి

- పొన్నెకల్ వద్ద నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రి పొంగులేటి



2లో






# ఇలా అయితే బతికేదెలా...?

(మొదటిపేజీ తరువాయి)
మునుపెన్నడూ లేనంతగా పెరిగిన ధరలు సామాన్య జనజీవితంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. అది ఇది అనే తేడా లేకుండా అన్నింటి ధరలు విపరీతంగా పెరిగాయి. ఏ వస్తువు ధర చూసినా గడిచిన ఏడాది కాలంలో పెరిగిందే తప్ప నిలకడగా ఉండడం లేదా తగ్గడం జరగలేదు. ఉదాహరణకు చూస్తుండగానే బియ్యం ధరలకు రెక్కలొచ్చాయి. ఇటీవల వరకు క్వింటా ఆరున్నర వేలు పలికిన బియ్యం ధర ఇప్పుడు ఎనిమిది వేల నుంచి ఎనిమిదిన్నర వేలకు చేరుకుంది. ధాన్యం ధర పెరుగుతుండటం వర్షాభావ పరిస్థితుల కారణంగా వరి సాగు తగ్గిపోవడంతో వ్యాపారులు ముందే బియ్యం ధరలను పెంచేశారు. ఈ ఏడాది క్వింటా బియ్యం ధర పదివేలు దాటే అవకాశం ఉందన్న భావన కలుగుతుంది. పప్పు, ఉప్పు, నూనెల ధరలు కూడా విపరీతంగా పెరుగుతున్నాయి. సంచుల్లో డబ్బులు చేతిలో సామాన్లు అన్న నానుడి ఇప్పుడు నిజమయ్యే పరిస్థితి ఏర్పడింది. గతంలో ధరల నియంత్రణకు సంబంధించి ప్రభుత్వం పలు చర్యలు తీసుకోవడంతో పాటు బ్లాక్ మార్కెటర్లపై కఠిన చర్యలు తీసుకునేది. ప్రతి వస్తువుకు గరిష్ట ధర నిర్ణయించి దానిని అమలయ్యేవిధంగా తగు చర్యలు తీసుకునేది. ప్రధాని మోడీ చేసిన చట్టాల సవరణ ఫలితంగా ఇప్పుడు ధరల నియంత్రణ లేకపోవడంతో పాటు బ్లాక్ మార్కెటర్లపై తగు చర్యలు తీసుకోవడం లేదు. వ్యాపారుల ఇష్టారాజ్యానికి వదిలివేయడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజల నడ్డివిరుగుతుంది. ఆదాయం తగ్గి ఖర్చులు పెరిగిన వేళ ప్రజలు అర్ధాకలితో జీవించాల్సిన పరిస్థితులు దాపురిస్తున్నాయి. దేశ ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగైందని కొనుగోలు శక్తి పెరిగిందని పాలకులు ఉదరగొడుతున్నారు. పెరిగిన ధరలను నియంత్రించకపోతే పేదల పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుంది.


ఒక పక్క కరువు ఛాయలు మరో పక్క అదుపులేని ధరలపై ప్రభుత్వం అత్యంత క్రియాశీలకంగా వ్యవహరించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### అదరగొడుతున్న ఎండలు...

ఎల్‌నినో ప్రభావం కారణంగా రాష్ట్రంలో ఎండలు అదరగొడుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలకు తోడు విపరీతమైన ఉక్కపోత ప్రజలను ఇబ్బందులు పెడుతుంది. గడిచిన పది రోజులుగా ఉదయం ఎనిమిది గంటల నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఎండకు జంకి ప్రజలు బయటకు రాలేకపోతున్నారు. వ్యవసాయంపై ఎండల ప్రభావం తీవ్రంగా చూపుతుంది. ఒక పక్క పత్తి, మిర్చి,వరి పంటలకు ఎర్రతెగుళ్లు రావడంతో పైర్లు ఎర్రబారుతున్నాయి. మరో పక్క భూగర్భ జల నీటి మట్టం రోజు రోజుకు పడిపోయి ఆందోళన కలిగిస్తుంది. సీజన్ ప్రారంభంలో కురిసిన ఒకట్రెండు వర్షాలకు తోడు వ్యవసాయ బోర్లను నమ్ముకుని వరి సాగు చేసిన రైతులు ఇప్పుడు తీవ్రంగా నష్టపోయారు. భూగర్భ జల మట్టం అడుగంటి బోర్ల నుంచి నీరు రాకపోవడంతో పైర్లలో పశువులను మేపుతున్నారు. పచ్చగా కళకళలాడాల్సిన పైర్లు భూములు నెర్రెలు బారి వాడిపోతున్నాయి. జీవనదుల్లాంటి అనేక ఏర్లు, నదులు వట్టిపోతున్నాయి. భూగర్భ జల నీటిమట్టం పడిపోతుండడంతో ఈ ఏడాది తాగునీటికి కూడా తీవ్ర ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి కనిపిస్తుంది.

### ప్రభలుతున్న వ్యాధులు...

అననుకూల వాతావరణంలో వ్యాధులు ప్రభలుతున్నాయి. అక్టోబర్ మాసంలో ఉండాల్సిన వాతావరణం లేకపోవడంతో విపరీతంగా జ్వరాలు వస్తున్నాయి. దానికి తోడు గొంతు నొప్పులు రావడంతో ప్రజలు ఆసుపత్రుల పాలవుతున్నారు. ఇటీవల కాలంలో డెంగ్యూ ఉధృతి కూడా పెరిగింది. సహజంగా జూన్, జూలై మాసాల్లో సీజన్ వ్యాధులకు గురయ్యే వారు. కానీ ఈ ఏడాది భిన్నమైన పరిస్థితి ఏర్పడింది. ఎక్కడ చూసినా ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే వారి సంఖ్య పెరుగుతుంది. ప్రైవేటు ఆసుపత్రులలో వైద్యం చేయించుకోలేక బాధితులు ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన వైద్యం అందకపోగా మందులు కూడా అందుబాటులో ఉండడం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. కరువు కాలంలో అదుపులేని ధరలు అననుకూల వాతావరణం ప్రభలుతున్న వ్యాధుల నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం ధరలను అదుపు చేసేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించడంతో పాటు అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉంది.

## బాబూజీ సేవలు చిరస్మరణీయం

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** చేనేత రంగ అభివృద్ధికి ఆచార్య కొండా లక్ష్మణ్ బాబూజీ సేవలు చిరస్మరణీయమన్నారు మంత్రి తుమ్మల. ఆదివారం సత్తుపల్లి పట్టణం లోని మున్సిపాలిటీ కార్యాలయం ఎదురుగా ఆచార్య కొండా లక్ష్మణ్ బాబూజీ విగ్రహాన్ని స్థానిక ఎమ్మెల్యే డా.మట్టా రాగమయిదయానంద్ తో కలిసి రాష్ట్ర వ్యవసాయశాఖామాత్యలు తుమ్మల నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ చేనేత రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. చేనేత కార్మికుల సంక్షేమం, రంగం అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, విజయ్ కుమార్, రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు కమర్తపు మురళి, పద్మశాలి సంఘం నాయకులు, సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ మహ్మద్ రిహానా కమల్ పాషా, పార్టీ పట్టణ అద్యక్షుడు గాదే చెన్నారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, వార్డు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మంత్రి తుమ్మల అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు ఉధృతం చేయాలి

**సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి**




**ప్రజాపక్షం/బోనకల్:** ప్రజా సమస్యల పరిష్కారానికి కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరంతర కృషి చేస్తూ ఉద్యమాలను ఉధృతం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. అదివారం మండలంలోని రాయన్నపేట గ్రామంలోని తూము ప్రకాశరావు భవన్‌లో నిర్వహించిన సిపిఐ మండల సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు ఎదురవుతున్న సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించాలని అన్నారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల హక్కుల సాధన కోసం పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో పని చేయాలని సూచించారు. పార్టీ నిర్ధేశించిన కార్యక్రమాలను గ్రామస్థాయిలో విస్తృతంగా నిర్వహిస్తూ ప్రజలను చైతన్యపరచాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నిర్మాణం, గత కార్యక్రమాల సమీక్ష, డిసెంబర్ 1,2,3 తేదిల్లో నిర్వహించనున్న దేశవ్యాప్త బైక్ బంద్ కార్యక్రమం, పార్టీ నిధి సేకరణ, ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఎన్నికల ఓటర్ల నమోదు తదితర అంశాలపై చర్చించారు. రానున్న రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై నాయకులు కార్యాచరణ రూపొందించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు బత్తినేని నీరజ, కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు, మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సమితి సభ్యులు తూము రోషన్‌కుమార్, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జక్కుల రామారావు, శాఖ కార్యదర్శి ఏలూరి పూర్ణచంద్రరావు, పార్టీ నాయకులు కార్యకర్తలు, మండల సమితి సభ్యులు పాల్గొన్నారు.

## బతుకమ్మ నిమజ్జన పనులను పరిశీలించిన సర్పంచ్



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ పట్టణంలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించేందుకు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు పట్టణంలోని వెదుళ్ల చెరువు నిమజ్జన ఘాటు వద్ద జరుగుతున్న బతుకమ్మ నిమజ్జన పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మహిళలు, యువతులు సంప్రదాయబద్ధంగా వేడుకలు నిర్వహించుకునేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ రంగు రంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి ఆడపడుచులు భక్తి శ్రద్ధలతో జరుపుకునే గొప్ప పండుగ బతుకమ్మ అన్నారు. బతుకమ్మ నిమజ్జనానికి వచ్చే ఆడపడుచులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా నిమజ్జన ఘాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు గ్రామ పంచాయతీ తరుపున తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి ఒక్కరూ బతుకమ్మ పండుగను సంతోషంగా, సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని సర్పంచ్ నాగేశ్వరరావు కోరారు.

### జూన్ నాటికి ఇంటిగ్రేటెడ్ స్కూల్

## అందుబాటులోకి రావాలి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** వచ్చే విద్యా సంవత్సరం జూన్ నాటికి పొన్నెకల్ వద్ద నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం ఖమ్మంరూరల్ మండలంలోని పొన్నెకల్ వదప్పద రూ.ప200కోట్ల వ్యయంతో చేపట్టిన పాఠశాల భవన సముదాయ నిర్మాణ పనులను మంత్రి, కలెక్టర్ దివాకర టిఎస్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రాంగాణమంతా కలియతిరుగుతూ వివిధ విభాగాల నిర్మాణ పురోగతిని సమీక్షించారు. అధికారులు మ్యాప్‌ల ప్రస్తుత పరిస్థితిని వివరించారు. పనుల నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి నిర్దేశిత గడువులోగా నిర్మాణాన్ని పూర్తి చేసేలా సమన్వ్యంతో పని చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ...పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి సదుపాయాలు కల్పించడమే ఈ పాఠశాలల ప్రధాన ఉద్దేశమని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, పలువురు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో బతుకమ్మ వేడుకలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకల్లో భాగంగా ఆదివారం రెండవ రోజు కలెక్టరేట్‌లో ఆటుకుల బతుకమ్మ వేడుకలను సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో అధికారులు, మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా జిల్లా బిసి అభివృద్ధి అధికారిణి జ్యోతి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని వాటిని భావితరాలకు అందించాలన్నారు. ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలతో బతుకమ్మ పండుగను జరుపుకుంటామన్నారు.

# శాస్త్రీయ దృక్పథంతో సమాజాన్ని అధ్యయనం చేయాలి

**మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పిలుపు**




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సమాజంలోని సమస్యలకు పరిష్కారం చూపాలంటే శాస్త్రీయ దృక్పథంతో అధ్యయనం చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సత్తుపల్లిలో ఆదివారం ప్రారంభమైన మూడు రోజుల రాష్ట్ర రాజకీయ శిక్షణా తరగతుల్లో ఆయన తత్వశాస్త్రం అంశంపై ప్రసంగించారు. మార్క్సిజం పిడివాదం కాదని, అదొక సామాజిక శాస్త్రమని పేర్కొన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ మార్పులను అర్థం చేసుకొని సిద్ధాంతాన్ని ఆచరణతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మాస్‌లైన్ నాయకులు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వానికి ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదని, రాజ్యాంగ వ్యవస్థలను తన ఆధీనంలోకి తీసుకుంటూ ఫాసిస్టు ధోరణులను ప్రోత్సహిస్తోందని విమర్శించారు. దేశ వనరులను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తోందని ఆరోపించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గోకినేపల్లి వెంకటేశ్వరరావు జెండా ఆవిష్కరించగా, కెచ్చల రంగారెడ్డి, కె. రమ, గుమ్మడి నరసయ్య తదితరులు తరగతులను ప్రారంభించారు. సాయంత్రం పార్టీ రాష్ట్ర నాయకురాలు ఎస్.ఎల్. పద్మ సరుకు, శ్రమ, అదనపు విలువ అంశాలపై బోధించారు. రాష్ట్ర, ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రిచే కల్లూరుగూడెం పామాయిల్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం

**మంత్రి తుమ్మల**



**ప్రజాపక్షం/వేంసూరు:** మండల పరిధిలోని కల్లూరు గూడెం పామాయిల్ ఫ్యాక్టరీ పనులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల తో పాటు స్థానిక శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ తో పాటు ఆయిల్ ఫెడ్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల ఆయిల్ ఫెడ్ అధికారులతో సమావేశం నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. వచ్చే నెలలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం చేయాలనే ఆలోచనతో ఉన్నామని, అందుకు అనుగుణంగా పనులు వేగవంతం చేసి ఈ నెల చివర కల్లా ఫ్యాక్టరీ నిర్మాణపు పనులు పూర్తి అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# ఎర్రజెండా నీడలో విజయోత్సాహం.. సిపిఐ శ్రేణుల కథనోత్సవం

**- ఏఐటీయూసీ గెలుపుతో ఖమ్మంరూరల్ కమ్యూనిస్టు సంబరాలు**
**- సిపిఐ ఆధ్వర్యంలో హోరెత్తిన విజయోత్సవ ర్యాలీ..**
**డీజే పాటలకు నృత్యాలు,**
**పటాసుల మోతతో మార్మోగిన వరంగల్‌క్రాస్‌రోడ్**







**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఎర్రజెండాల రెపరెలాడాయి. విప్లవ గీతాలు హోరెత్తాయి. కార్మిక విజయ నినాదాలు మార్మోగాయి. డీజే పాటలకు కమ్యూనిస్టు శ్రేణులు ఉత్సాహంగా కాలు కదిపాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ కార్మిక సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీ విజయం సాధించడంతో భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) ఆధ్వర్యంలో ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్ సెంటర్‌లో శనివారం విజయోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. ఎర్రజెండా సాక్షిగా..కార్మిక విజయమే ఉత్సవంగా సిపిఐ శ్రేణులు ఘనంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించాయి.

### ఎర్రజెండాల రెపరెపలు అడుగడుగునా విజయోత్సాహం

ఏఐటీయూసీ విజయాన్ని పురస్కరించుకొని సిపిఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ర్యాలీకి తరలివచ్చారు. చేతుల్లో ఎర్రజెండాలు..గొంతుల్లో విజయ నినాదాలు. అడుగుల్లో ఉత్సాహం..ఇలా వరంగల్‌క్రాస్‌రోడ్ ప్రాంతం ఎర్రజెండాల సందడితో కళకళలాడింది. సిపిఐ ఆధ్వర్యంలో ప్రారంభమైన ర్యాలీ వరంగల్‌క్రాస్‌రోడ్ సెంటర్ నుంచి వార్తా కార్యాలయం మీదుగా తిరగి అదే కూడలికి చేరుకుంది. మార్గమంతా డీజే పాటలు, కమ్యూనిస్టు గీతాలకు నాయకులు, కార్యకర్తలు నృత్యాలు చేస్తూ విజయోత్సాహాన్ని చాటుకున్నారు. పటాసులు పేల్చి సంబరాలు జరుపుకోవడంతో ఆ ప్రాంతమంతా పండుగ వాతావరణం నెలకొంది.

### కార్మిక విజయానికి సిపిఐ ఘన స్వాగతం

ఆర్టీసి ఎన్నికల్లో ఏఐటీయూసీ సాధించిన విజయంతో సిపిఐ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం కనిపించింది. కార్మిక సంఘం విజయాన్ని పురస్కరించుకొని పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీ నాయకులు, కార్యకర్తల ఉత్సహానికి వేదికగా నిలిచింది. ఎర్రజెండాల రెపరెపల మధ్య సాగిన సంబరాలు కార్మిక ఉద్యమంతో సిపిఐకి ఉన్న అనుబంధాన్ని ప్రతిబింబించాయి. నాయకులు, కార్యకర్తలు ఒకచోట చేరి విజయాన్ని వేడుకగా జరుపుకున్నారు.

### ప్రముఖ నాయకుల హాజరు

ఈ విజయోత్సవ ర్యాలీలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్‌తో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా సమితి సభ్యులు మండల సమితి సభ్యులు, సిపిఐ కౌన్సిలర్లు పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, ఏఐటీయూసీ ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేరబోయిన మోహన్‌రావు జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను. బద్దల మల్లయ్య, బీకేఎంయూ జిల్లా నాయకులు తాటి వెంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, బానోత్ రాంకోటి, వెంపటి సురేందర్, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, సిపిఐ కౌన్సిలర్లు దండి రంగారావు, మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, దండి శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

# ఇండస్ట్రియల్ టూర్‌లో జెడ్పిహెచ్‌ఎస్ మడుపల్లి విద్యార్థులు




**ప్రజాపక్షం/మధిర:** విద్యార్థులు, ఉపాధ్యాయులు శ్రీశైలం ప్రాజెక్టుని సందర్శించారు. మొదటగా శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జునస్వామి దర్శనం చేసుకున్నారు. తర్వాత రుద్ర బొటానికల్ గార్డెన్‌ను, శివాజి మ్యూజియాన్ని తిలకించారు. ప్రపంచ ఖ్యాతిగాంచిన శ్రీశైలం హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టుని, శ్రీశైలం ఎకో పార్క్‌లను సందర్శించారు. జలవిద్యుత్ కేంద్రం శ్రీశైలం హైడ్రోలక్ట్రిక్ ప్లాంట్, జీవ వైవిద్య ప్రాముఖ్యతను, జీవ వైద్య పరిరక్షణ ప్రాధాన్యతను తెలుసుకున్నారు. పిఎం శ్రీకార్యక్రమాల్లో భాగంగా ఇండస్ట్రియల్ టూర్‌గా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి గాను ఖర్చు రూ.60వేలు ప్రభుత్వం వెచ్చించగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆర్థిక భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. దీనికి సహకరించి ప్రోత్సహించిన డిఈవో ఖమ్మం డి.వాసవి, జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ సిహెచ్.రామకృష్ణ, ఏఎంవో పెసర ప్రభాకర్‌రెడ్డి, సిఎంవో బాజజు ప్రవీణ్‌లకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా దేవి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



**ప్రజాపక్షం/మధిర:** మధిర పట్టణంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో దేవి నవ రాత్రి ఉత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ శ్రీనివాసులు శేషాచార్యులు ఆధ్వర్యంలో వాసవి మాతకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, కుంకుమార్చనలు వైభవంగా నిర్వహించారు. అనంతరం వాసవి మాత జెండాని ఆవిష్కరించారు. కమిటీ సభ్యులు, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నియోజక వర్గ ఇంచార్జిల నియామకం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియ కోసం కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇంచార్జిలను నియమించినట్లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఆదివారం తెలిపారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు ఎంఎల్‌సి ఓటరు నమోదు ప్రక్రియ కోసం నియోజక వర్గ ఇంచార్జిలను నియమించినట్లు ఆయన తెలిపారు. ఖమ్మం నియోజక వర్గ ఇంచార్జిగా రాష్ట్ర కార్పోరేషన్ మాజీ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, పాలేరు నియోజక వర్గ ఇంచార్జిగా టిపిసిసి ప్రధాన కార్యదర్శి మద్దినేని స్వర్ణకుమారి, మధిర నియోజక వర్గ ఇంచార్జిగా మాజీ ఎంఎల్‌సి పోట్ల నాగేశ్వరరావు, వైరా నియోజక వర్గ ఇంచార్జిగా జిల్లా కాంగ్రెస్ నాయకులు వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సత్తుపల్లి నియోజక వర్గ ఇంచార్జిగా మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మి నారాయణ లను నియమించినట్లు సత్యనారాయణ గౌడ్ తెలిపారు. ఇంచార్జిలంతా నియోజక వర్గంలోని మండలాల్లో పర్యటించి పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని సూచించారు.

# ఖాదర్ కుటుంబానికి మువ్వా పరామర్శ



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సీనియర్ జర్నలిస్ట్ , టి యూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర నాయకులు షేక్ ఖాదర్ బాబా కుటుంబాన్ని టిజిఐడిసీ చైర్మన్ మువ్వా విజయ బాబు ఆదివారం పరామర్శించారు. గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో ఖాదర్ బాబా సతీమణి మృతిచెందారు. మువ్వా వెంట బేతుపల్లి సర్పంచ్ దొడ్డా రాజేంద్రప్రసాద్ (అమ్ములు) దొడ్డా కిషోర్, నాగరాజు, మానస నాని, కాంగ్రెస్ నాయకులు షరీఫ్, అబ్దుల్లా, రామారావు, పార్థసారది, నజీర్, బాస్కర్, సురేష్ తదితరులున్నారు.

# ఘనంగా సెంటిని డాక్టర్ శ్రీమన్నారాయణ హాస్పిటల్ ప్రారంభోత్సవం



**ప్రజాపక్షం/మధిర:** విజయవాడ–తాడేపల్లి వారధి సమీపంలోని సర్వీస్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన అత్యాధునిక సెంటిని డాక్టర్ శ్రీమన్నారాయణ హాస్పిటల్ ప్రారంభోత్సవ వేడుక ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత రామనాథం దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలను, అందుబాటులో ఉన్న అత్యాధునిక వైద్య పరికరాలను వారు పరిశీలించారు. అనంతరం డాక్టర్ శ్రీమన్నారాయణకు తమ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సుజాత రామనాథం మాట్లాడుతూ విజయవాడ తాడేపల్లి ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు ఈ ఆసుపత్రి ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు ప్రజల ఆరోగ్యం పట్ల అంకితభావంతో పనిచేస్తున్న డాక్టర్ శ్రీమన్నారాయణ సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. అనంతరం డాక్టర్ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ పేదలకు సైతం తక్కువ ఖర్చుతో అత్యుత్తమ వైద్యం అందించడమే తమ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో 24గంటలూ సేవలు అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎ.కె.రామారావు, దెందుకూరు సొసైటీ చైర్మన్ కోట వెంకటకృష్ణ, ఈనాడు సీనియర్ విలేకర్ యడ్లపల్లి శ్రీనివాసరావు, వెలగపూడి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మతిస్థిమితం లేని యాచకుడు మృతి

**-మార్చురీకి చేర్చిన అన్నం ఫౌండేషన్**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం టూటౌన్ పరిధిలోని కొత్త బస్టాండ్ ఎదురుగా గల రోడ్డులో యాచకుడు మృతిచెందాడు. వంటిపై బట్టలు లేకుండా ఎలాంటి గాయాలు లేని ఈ వ్యక్తికి సుమారు 45 ఏళ్ల వయస్సు ఉంటుందని అంచనా వేస్తున్నారు. చామనఛాయ రంగు కలిగి వేలుకు తెల్లటి ఉంగరం ఉంది. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించ లేదు. మృతదేహం పురుగులు పట్టి ఉండడంతో పోలీసులు అన్నం ఫౌండేషన్‌కు సమాచారం ఇచ్చారు. అన్నం ఫౌండేషన్ ఛైర్మన్ అన్నం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు.

# సోమవరం వద్ద రహదారిపై భారీ గుంతలు..!



**-ప్రమాదం జరిగితే ఎవరి బాధ్యత?**
**-వాహనదారుల్లో ఆందోళన**
**-అధికారులు మరమ్మతులు చేపట్టాలని ప్రజల డిమాండ్**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని సోమవరం వద్ద అంతరాష్ట్ర రహదారిపై ఏర్పడిన భారీ గుంతలు ప్రజలను, వాహనదారులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. రహదారిపై ఏర్పడిన గుంతలను చూస్తేనే భయాందోళనలు కలుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులకు ఎప్పుడు, ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొంది. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నప్పటికీ, వాటిని పూడ్చి మరమ్మత్తులు చేపట్టడంలో సంబంధిత అధికారులు ఎందుకు జాప్యం చేస్తున్నారనే ప్రశ్నలు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి. ప్రమాదాలకు ఆస్కారంగా మారిన ఈ గుంతలు అధికారులకు కనిపించడం లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా రద్దీగా ఉండే అంతరాష్ట్ర రహదారిపై ఇలాంటి పరిస్థితులు కొనసాగడం ప్రమాదకరమని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుంతల కారణంగా ప్రమాదం జరిగి ఎవరికైనా ప్రాణనష్టం లేదా గాయాలు సంభవిస్తే బాధ్యత ఎవరు వహిస్తారని నిలదీస్తున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి సోమవరం వద్ద రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చి శాశ్వత మరమ్మత్తులు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే, ముందుగానే చర్యలు తీసుకొని ప్రమాదాలను నివారించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# శివలింగాపురం అభివృద్ధికి మరో ముందడుగు

**రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, సైడ్ డ్రైన్‌ను ప్రారంభించిన పాయం**



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం వద్ద రూ. 25 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు, సైడ్ డ్రైన్‌ను పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. స్థానిక ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడంతో పాటు, మురుగునీరు సక్రమంగా పారేలా సైడ్ డ్రైన్ నిర్మాణం చేపట్టడం ద్వారా పరిసరాల పరిశుభ్రతకు, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు దోహదపడనుంది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పినపాక నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. నాణ్యమైన సీసీ రోడ్ల నిర్మాణం ద్వారా ప్రజల రాకపోకలు సులభతరం కావడంతో పాటు, రహదారులపై ప్రయాణించే వారికి మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. శివలింగాపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం పరిసరాల్లో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడం వల్ల వైద్య సేవల కోసం వచ్చే ప్రజలకు, అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులకు, వారి తల్లిదండ్రులకు రాకపోకల పరంగా ఎంతో సౌకర్యం కలుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో రహదారులపై నీరు నిలవడం, బురద కారణంగా ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులను తగ్గించేందుకు రహదారి నిర్మాణంతో పాటు సైడ్ డ్రైన్ ఏర్పాటు చేయడం ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. రోడ్డు నిర్మాణంతో పాటు సైడ్ డ్రైన్ ఏర్పాటు చేయడం వల్ల మురుగునీరు సక్రమంగా ప్రవహించేందుకు అవకాశం కలుగుతుందని, పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండే సమస్యను తగ్గించవచ్చని పేర్కొన్నారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం, ఆరోగ్యకరమైన పరిసరాలను అభివృద్ధి చేయడం కూడా మౌలిక సదుపాయాల కల్పనలో ముఖ్యమైన భాగమని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపడుతూ, స్థానిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పినపాక నియోజకవర్గంలో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలు, తాగునీటి సౌకర్యాలు, పారిశుధ్యం తదితర మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి ఫలాలు ప్రతి గ్రామానికి, ప్రతి వార్డుకు చేరేలా ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా నియోజకవర్గంలో అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతున్నామని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. శివలింగాపురం అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తామని, ప్రజల సహకారంతో పినపాక నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అధికారులు, మణుగూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు పిరినాకి నవీన్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు కురం రవి ముదిరాజ్, జిల్లా ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మైనారిటీ నాయకులు, మహిళా నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణికి రూ 59కోట్ల బకాయిలు చెల్లించాలి

**-ఏఐటీయూసీ నాయకుల పిలుపు**




**ప్రజాపక్షం/ఇల్లందు:** తెలంగాణ జెన్‌కో, ట్రాన్స్‌కోల నుంచి సింగరేణి కాలరీస్ కంపెనీకి రావాల్సిన రూ 59వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ బకాయిల సాధన కోసం అక్టోబర్ 13న హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధ ముట్టడిని జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ కమిటీ సమావేశం ఉపాధ్యక్షుడు దాసరి రాజారామ్ అధ్యక్షతన జరిగింది. యూనియన్ కేంద్ర కమిటీ ఉప ప్రధాన కార్యదర్శి కె సారయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎండీ నజీర్ అహ్మద్ మాట్లాడుతూ రాష్ట్రంలో గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగరేణి బకాయిలను ఇప్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. బకాయిలు అందకపోతే సంస్థ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని, కార్మికులకు లాభాల వాటా, దీపావళి బోనస్ చెల్లింపులకు కూడా నిధులు అవసరమని పేర్కొన్నారు. సింగరేణి కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఛలో విద్యుత్ సౌధ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈసమావేశంలో నాయకులు దాట్ల వెంకటేశ్వర్లు, వి జయరాజ్, నాదెండ్ల శ్రీనివాస్‌రెడ్డి, మాలోత్ హరి సింగ్, చిక్కా శ్రీనివాస్, గుగులోత్ కృష్ణ, యుగేందర్, జక్కుల శ్రీనివాస్, విజయ్ శ్రీనివాస్, గుగ్గిల్ల శ్రీనివాస్, చెరుకు సారయ్య, ఎస్ రవి, తదితరులు పాల్గొన్నారు.

# గోల్డ్‌మెడల్ సాధించిన అఖీల్ ఖాన్




**ప్రజాపక్షం/కారేపల్లి:** కుటుంబ కష్టాలను ఎదుర్కొంటూనే పట్టుదలతో చదువు పూర్తి చేసి గోల్డ్‌మెడల్ సాధించిన సింగరేణి మండలానికి చెందిన మహమ్మద్ అఖీల్ ఉల్లాఖాన్ పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు. మాజీ వార్డు సభ్యుడు మహమ్మద్ ఖలీల్ ఉల్లా ఖాన్, రషీదా దంపతుల కుమారుడైన అఖీల్ రాజమహేంద్రవరంలోని జీఎస్ఎల్ మెడికల్ కాలేజీలో ఉచిత సీటు పొంది, డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య శాస్త్రాల విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న కళాశాలలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. తండ్రి తీవ్ర రోడ్డు ప్రమాదానికి గురైన సమయంలో కుటుంబానికి అండగా నిలుస్తూనే, కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్న తల్లికి సేవలు అందించారు. కుటుంబ బాధ్యతలను నిర్వహిస్తూ, చెల్లెలు రీషా బాగోగులను చూసుకుంటూనే చదువును కొనసాగించి ఈ ఘనత సాధించారు. కష్టాలు ఎదురైనా లక్ష్యంపై దృష్టి నిలిపి విజయం సాధించడం యువతకు ఆదర్శమని పలువురు అభినందిస్తున్నారు. జీఎస్ఎల్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు, చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కర్‌రావు ముఖ్యఅతిథిగా, వైద్య పర్యవేక్షకుడు డాక్టర్ సోమనాథ్ దాస్, ప్రిన్సిపాళ్లు డాక్టర్ సీహెచ్ ప్రగతి, డాక్టర్ వీఎస్ గురునాథ్, నేత్ర వైద్య విభాగ ప్రొఫెసర్ డాక్టర్ నిర్మల జ్యోతి, మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ టి సత్యప్రకాశ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కంటి వైద్య రంగంలో నిపుణుడిగా ఎదుగుతున్న అఖీల్ ఖాన్ భవిష్యత్తులో సమాజానికి విశేష సేవలందించాలని కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు ఆకాంక్షించారు.

# 30 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేత



**ప్రజాపక్షం/కూసుమంచి:** మండలానికి చెందిన 30 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాల కింద మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం చెక్కులు పంపిణీ చేశారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ దివాకర్ టీఎస్, ఎస్పీ సునీల్ దత్‌తో కలిసి రూ 30,03,480 విలువైన చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద కుటుంబాలకు అండగా నిలిచేందుకు ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అన్ని వర్గాలకు లబ్ధి చేకూరేలా ప్రజాపాలన కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏదులాపురం మున్సిపల్ ఛైర్ పర్సన్ పోకబత్తిని అనిత, సర్పంచ్ కొండా కృష్ణవేణి, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఫారెస్ట్ గ్రౌండ్‌లో దసరా ఉత్సవాలు



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇల్లందు మున్సిపాలిటీలో ఎన్నో ఏళ్లుగా ఫారెస్ట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలను ఈ ఏడాది కూడా అక్కడే ఏర్పాటు చేయడంతో నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జమ్మి పూజలు, దసరా వేడుకలకు ఈ మైదానంతో ప్రజలకు భావోద్వేగ అనుబంధం ఉందని, ఇక్కడే ఉత్సవాలు నిర్వహించడం తమ మనోభావాలకు సంబంధించిన అంశమని పేర్కొంటున్నారు. గతంలో సింగరేణి గ్రౌండ్‌లో ఉత్సవాలు నిర్వహించినప్పుడు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, అక్కడ ఆశించిన భక్తి వాతావరణం కనిపించలేదని పలువురు అభిప్రాయపడ్డారు. ప్రజల అభీష్టాన్ని గుర్తించి ఈ ఏడాది ఫారెస్ట్ గ్రౌండ్‌లోనే ఉత్సవాల ఏర్పాటుకు కృషి చేసిన ఇల్లందు ఎంఎల్‌ఏ, మున్సిపల్ చైర్మన్ దొడ్డ కిరణ్ మిత్ర దానియల్‌కు ప్రజలు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.

# బోడు పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ వార్షిక తనిఖీ

**ప్రజాపక్షం/ఇల్లందు:** పోలీస్ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ యు వెంకన్న బాబు సూచించారు. ఆదివారం బోడు పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీ నిర్వహించారు. స్టేషన్ రికార్డులు, పరిసరాలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించడంతో పాటు తెలంగాణ స్పెషల్ పోలీస్ సిబ్బంది విధులు, గార్డు నిర్వహణను తనిఖీ చేశారు. సిబ్బంది కిట్లను పరిశీలించి పరేడ్ నిర్వహించారు. పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై నిఘా పెంచి, నిందితులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీషీటర్లు, అసాంఘిక శక్తుల కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చేబాధితుల సమస్యలను ఓపికగా విని, గౌరవప్రదంగా వ్యవహరించాలని తెలిపారు. స్టేషన్‌లో పరిశుభ్రత, క్రమబద్ధత కోసం 5ఎస్ విధానాన్ని తప్పని సరిగా అమలు చేయాలని, సిబ్బంది క్రమ శిక్షణ, సమయ పాలన, విధి నిబద్ధతకు ప్రాధాన్యమివ్వాలని ఆదేశించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ సమన్వయంతో పని చేయాలని డీఎస్పీ సూచించారు.

# దేశభక్త యువజన సంఘం ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు

**ప్రజాపక్షం/మధిర:** పట్టణంలోని లడక బజార్‌లో దేశభక్త యువజన సంఘం ఆధ్వర్యంలో శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నల్లమోతు శ్రీనివాసరావు దంపతులు పూజా పీఠంపై కూర్చొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పది రోజులపాటు రోజుకో అలంకారంలో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉత్సవాల సందర్భంగా మండపాన్ని భారీ విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రతిరోజు సాయంత్రం మండపం వద్ద బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ ఆటపాటలతో సందడి చేస్తూ తమ భక్తిభావాన్ని చాటుకుంటున్నారు. ఈ కార్యక్రమాల్లో దేశభక్త యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# కారు నడిపే కథానాయకుడు ఎవరు?

-స్టీరింగ్ ఎవరి చేతిలో?
-వైరా కారు...డ్రైవర్ ఎక్కడ?
-మండలాల్లో బలమైన నాయకత్వం..కేడర్‌ను కాపాడుకుంటున్న నేతలు
-ఎమ్మెల్సీ ఎన్నికల వేళ మరింత పెరిగి ఉత్కంఠ

**ప్రజాపక్షం/వైరా :** వైరా నియోజకవర్గంలో బిఆర్ఎస్ కారును నడిపిస్తున్న కథానాయకుడు ఎవరు...?నియోజకవర్గానికి అధికారికంగా ఇంచార్జి లేకపోవడంతో పార్టీకి దిశానిర్దేశం చేసేది ఎవరు? మండలాల వారీగా నాయకత్వం ఉన్నప్పటికీ...మొత్తం నియోజకవర్గాన్ని సమన్వయం చేసే నాయకత్వం ఎక్కడ...? ప్రస్తుతం వైరా బిఆర్ఎస్‌లో ఈ ప్రశ్నలు రాజకీయంగా ఆసక్తికర చర్చకు దారితీస్తున్నాయి. నియోజకవర్గంలో అధికారిక ఇంచార్జి లేకున్నా బిఆర్ఎస్ కేడర్ పూర్తిగా చెదిరిపోలేదని పార్టీ కార్యకలాపాలు స్పష్టం చేస్తున్నాయి. వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు, జూలురుపాడు మండలాల్లో పలువురు స్థానిక నాయకులు తమ పరిధిలో కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. అయితే ఒ కే నాయకత్వం క్రింద మొత్తం నియోజకవర్గాన్ని నడిపించే వ్యవస్థ లేకోవడం మాత్రం కేడర్‌లో కొంత అయోమయానికి కారణమవుతుందనే చర్చ ఉంది.

### బలమైన నాయకత్వం....కాని ఇంచార్జి ఎవరు?

వైరా నియోజకవర్గంలో బిఆర్ఎస్‌కు గ్రామస్థాయి నుంచి మండలస్థాయి వరకు నాయకులు, కార్యకర్తల నెట్‌వర్క్ ఉన్నప్పటికీ...నియోజకవర్గ ఇంచార్జి నియామకం మాత్రం జరగలేదు. దీంతో పార్టీ కార్యక్రమాల విషయంలో స్థానిక నాయకులే తమ పరిధిలో నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగుతున్న పరిస్థితి కనిపిస్తుంది. ఎవరితో కలిసి పనిచేయాలి? భవిష్యత్తులో పార్టీ బాధ్యతలు ఎవరికి దక్కుతాయి? నియోజకవర్గ స్థాయిలో పార్టీని ముందుకు నడిపించే నాయకుడు ఎవరు? అనే అంశాలపై కేడర్‌లో స్పష్టత కోసం ఎదురుచూపులు ఉన్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

### పంచాయతీల్లో పోటీ...మున్సిపాలిటీలో ఢీ

ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో పలు ప్రాంతాల్లో బిఆర్ఎస్ నాయకులు అధికార కాంగ్రెస్‌కు గట్టి పోటీ ఇచ్చారు. కొన్ని పంచాయతీల్లో పార్టీ అనుకూల అభ్యర్థులు విజయం సాధించడం ద్వారా స్థానికంగా తమ బలాన్ని చాటుకున్నారని బిఆర్ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి. వైరా మున్సిపాలిటీలోను కాంగ్రెస్, బిఆర్ఎస్ వర్గాల మధ్య రాజకీయ పోటీ కొనసాగింది. దీంతో అధికారిక ఇంచార్జి లేకపోయినా స్థానిక నాయకత్వం పార్టీని నిలబెట్టేందుకు ప్రయత్నిందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

### వైరాలో కట్టా కృష్ణార్జునరావు చొరవ

వైరా మండలంలో బిఆర్ఎస్ జిల్లా నాయకుడు కట్టా కృష్ణార్జునరావు పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా వ్యవహరిచస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. స్థానిక పరిస్థితులను జిల్లా, రాష్ట్రస్థాయి నాయకత్వానికి తెలియజేస్తూ పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటున్నారని పేర్కొంటున్నాయి. వనమా విశ్వేశ్వరరావు, బాణాల వెంకటేశ్వర్లు, మాదినేని దుర్గాప్రసాద్, చిలకా కోటయ్య, దొంతెబోయిన వెంకటేశ్వర్లు, లాల్‌మహ్మద్, మద్దెల రవి, కొత్తా వెంకటేశ్వరరావు, సిరిపురం సర్పంచ్ శెట్టిపల్లి శ్రీనివాసరావు, కామినేని శ్రీనివాసరావు, అయినాల కనకరత్నం, పల్లబి శ్రీను, దొంతెబోయిన శ్రీనివాసరావు, వల్లాపురం ఉప సర్పంచ్ వేల్పుల నారాయణ, బట్టా భద్రయ్య, విలాసాగరం నరేష్, అప్పం సురేష్, తిరుపతి శ్రీను, ఆదూరి ప్రేమ్, బోస్, మిట్టపల్లి కిరణ్‌కుమార్, నూకల ప్రసాద్, నూకల వాసు, దేవారాజు, సత్యానందం, పారుపల్లి నాగం తదితరులు కూడా పార్టీ కార్యక్రమాల్లో తమవంతు పాత్ర పోషిస్తున్నారని బిఆర్ఎస్ నాయకులు చెబుతున్నారు. కట్టా కృష్ణార్జునరావు తన పరిధిలో బలమైన అభ్యర్థుల ఎంపిక, స్థానిక నాయకులతో సమన్వయం వంటి అంశాలపై దృష్టి సారిస్తూ పార్టీని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నారు.



### కొణిజర్లలోను కేడర్‌కు అండ పోట్ల

కొణిజర్ల మండలంలో పోట్ల శ్రీను–కవిత దంపతులు పార్టీ కార్యక్రమాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారని బిఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. పలు పంచాయతీల్లో పార్టీ అనుకూల అభ్యర్థులకు మద్దతుగా నిలిచి ఫలితాలు సాధించారని పేర్కొంటున్నాయి. బోడపోతుల బాబు, కిలారి కిరణ్, పాముల వెంకటేశ్వర్లు, కిలారు మాధవరావు, దొడ్డపు రామారావు, చల్లా మోహన్‌రావు తదితరులు కూడా మండలంలో కార్యకర్తలతో సంబంధాలు కొనసాగిస్తున్నారని సమాచారం.

### కారేపల్లి...ఏన్కూరు...జూలురుపాడు

కారేపల్లి మండలంలో మాజీ జెడ్పిటిసి జగన్, వీరేందర్, గౌస్ తదితరులు పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఏన్కూరు మండలంలో జెడ్పిటిసి బాదావత్ బాలాజినాయక్, మోహన్‌రావు, రైలు తదితరులు పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా ఉన్నారని సమాచారం. జూలురుపాడు మండలంలో ఎల్లంకి సత్యనారాయణ, లకావత్ గిరిబాబు, మూడు చిట్టిబాబు తదితరులు కార్యకర్తలతో అనుసంధానం కొనసగిస్తూ పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

### పలువురు నేతల పర్యటనలతో అయోమయం?

ఇంచార్జి నియామకం లేకపోవడంతో నియోజకవర్గంలో పలువురు సీనియర్ నేతలు, ఆశావాహులు తమదైన శైలిలో పర్యటించడం కూడా బిఆర్ఎస్ కేడర్‌లో చర్చకు దారితీస్తుంది. మాజీ ఎమ్మెల్యే చంద్రావతి, స్వర్గీయ బానోతు మదన్‌లాల్ కుమార్తె బానోతు మనీషా లక్ష్మి, లకావత్ గిరిబాబు తదితరులు నియోజకవర్గంలో పర్యటిస్తూ కార్యకర్తలను కలుస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మదన్‌లాల్ సోదరుడు బానోతు మదన్‌లాల్ కూడా తరచుగా నియోజకవర్గంలో పర్యటిస్తున్నారని పేర్కొంటున్నాయి. దీంతో కార్యకర్తల్లో ఒక ప్రశ్న మాత్రం మిగులుతుంది. ఎవరితో కలిసి పనిచేయాలి? భవిష్యత్తులో పార్టీ బాధ్యతలు ఎవరికి దక్కుతాయి? అన్న స్పష్టత లేకపోవడం వలన కొంత అయోమయ పరిస్థితి ఏర్పడుతుందని పార్టీ వర్గాల్లో చర్చ సాగుతుంది.

### పువ్వాడ అజయ్ సమన్వయంపై చర్చ

మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వైరా నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి కొనసాగిస్తున్నారని బిఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. ఐదు మండలాల్లోని నాయకులతో సంబంధాలు కొనసాగిస్తూ పార్టీ పరిస్థితులు తెలుసుకుంటున్నారని, స్థానిక నాయకత్వాన్ని అనుసంధానం చేస్తున్నారని పేర్కొంటున్నాయి. అధికారిక ఇంచార్జి లేకున్నా జిల్లాస్థాయి నాయకత్వం ద్వారా పార్టీ కార్యక్రమాలు కొనసాగుతున్న నేపద్యంలో ఈ సమన్వయానికి భవిష్యత్తులో ఎలాంటి రూపం ఇస్తారన్నది ఆసక్తికరంగా మారిది.

### కారుకు డ్రైవర్ ఎప్పుడు?

వైరా నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీకి నాయకత్వం లోటు ఉందా? లేక మండలాల వారీగా ఉన్న నేతలే ప్రస్తుతం పార్టీని నడిపిస్తున్నారా? అనేది ఇప్పుడు ప్రధాన చర్చ. ఒకవైపు బలమైన స్థానిక నాయకులు పార్టీ కేడర్‌ను కాపాడుకుంటూ ముందుకు సాగుతున్నారు. మరోవైపు నియోజకవర్గ స్థాయిలో అధికారిక ఇంచార్జి లేకపోవడం వలన పార్టీకి ఒకే దిశలో స్పష్టమైన కమాండ్ వ్యవస్థ లేదనే అభిప్రాయం వినిపిస్తుంది. రాబోయే పట్టభద్రుదల ఎమ్మెల్సీ ఎన్నికల నేపద్యంలో ఈ అంశం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్నికల సమయంలో నియోజకవర్గస్థాయిలో సమన్వయం కీలకం కానుండటంతో బిఆర్ఎస్ అధిష్టానం వైరాకు ఇంచార్జిని నియమిస్తుందా? లేక ప్రస్తుత మండలాల నాయకత్వానికి పార్టీ శ్రేణుల్లో ఆసక్తిని రేకెత్తిస్తుంది. వైరాలో బిఆర్ఎస్ కేడర్ ఉంది. నాయకత్వం ఉంది. స్థానికంగా పోరాడే నేతలూ ఉన్నారు. కాని నియోజకవర్గస్థాయిలో కారు స్టీరింగ్ ఎవరి చేతిలో ఉంటుందన్నది మాత్రం ఇంకా తేలాల్సి ఉంది.

---

## వైరాలో అట్టహాసంగా 12వ సీనియర్ అంతరాష్ట్ర సెపక్ తక్రా ఛాంపియన్‌షిప్ ప్రారంభం





**ప్రజాపక్షం/వైరా:** వైరాలోని న్యూలిటిల్ ఫ్లవర్ పాఠశాల వేదికగా 12వ సీనియర్ అంతరాష్ట్ర సెపక్ తక్రా(లెగ్ వాలీబాల్) ఛాంపియన్‌షిప్ 202627 పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఖమ్మం జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కాపా మురళీకృష్ణ, పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు క్రీడాకారుల ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. డాక్టర్ కాపా మురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి సుడా ఛైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డిసిసి అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, వైరా ఏసిపి ఎస్.సారంగపాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, తెలంగాణ సెపక్ తక్రా అసోసియేషన్ అధ్యక్షుడు పెరిక సురేష్ తదితరులు పాల్గొన్నారు. న్యూలిటిల్ ఫ్లవర్ పాఠశాలకు చెందిన 11వ బెటాలియన్ ఎన్ఎస్‌పి క్యాడెట్లు, ఉమ్మడి ఖమ్మం సహా తెలంగాణలోని పది జిల్లాలకు చెందిన పురుషులు, మహిళా క్రీడాకారులు నిర్వహించిన మార్చ్ ఫాస్ట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అతిధులు క్రీడాకారుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, పెరిక సురేష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోటీలను ప్రారంభించారు.

**న్యూలిటిల్ ఫ్లవర్ పాఠశాలలో క్రీడా సంబరాలు**



### క్రీడలతో జిల్లాకు గుర్తింపు తీసుకురావాలి...

ఈ సందర్భంగా అతిధులు మాట్లాడుతూ అంతరాష్ట్ర స్థాయి సెపక్ తక్రా ఛాంపియన్‌షిప్ పోటీలకు వైరాలోని న్యూలిటిల్ ఫ్లవర్ పాఠశాల వేదిక కావడం పట్టణానికి గర్వకారణమని పేర్కొన్నారు. క్రీడాకారులు ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు అభినందనీయులని అన్నారు. ప్రతి క్రీడాకారుడు గెలుపే లక్ష్యంగా కృషి చేస్తూ తమ తల్లిదండ్రులకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అంతరాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఈ నెల29 నుంచి నవంబర్3 వరకు మధ్య ప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఒలింపిక్స్‌లో పాల్గొని స్వర్ణ పతకాలు సాధించి దేశ కీర్తిని ప్రపంచవ్యాప్తంగా చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మమత మెడికల్ కాలేజీ జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.శివరామకృష్ణ, వైరా ఎస్ఐ పి.రామారావు, న్యూలిటిల్ ఫ్లవర్ పాఠశాల డైరెక్టర్ లగడపాటి ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

---

## కూసుమంచి ప్రయాణికుల సమస్యలు పరిష్కరించాలి

-మంత్రి పొంగులేటికి జాయింట్ యాక్షన్ కమిటీ వినతి



**ప్రజాపక్షం/ఖమ్మం :** మండల కేంద్రంలోని ప్రయాణికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీడబ్ల్యూఎంఎఫ్ జిల్లా ఇన్‌చార్జి గుండా ఉపేందర్‌రెడ్డి కోరారు. కూసుమంచి జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. వారం రోజులుగా ప్రయాణికుల నుంచి సేకరించిన సంతకాలతో పాటు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కూసుమంచి నుంచి ఉదయం 4,4:30 గంటలకు నడిచే ఖమ్మం, హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ బస్సులను పునరుద్ధరించాలని కోరారు. అన్ని ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులు 24గంటలూ కూసుమంచి మీదుగా నడపాలని, బైపాస్ మీదుగా వెళ్లే రాజధాని బస్సులకు ఫ్లైఓవర్ సమీపంలో ఆపే సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. బస్‌స్టాండ్ లేక విద్యార్థులు, గర్భిణులు, చిన్నారులు, వృద్ధులు, ఎండకు, వానకు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే షెల్టర్ లేదా గ్రీన్ నెట్ ఏర్పాటు చేయాలని కోరారు. పండుగల సమయంలో ప్రత్యేక బస్సుల పేరుతో వసూలు చేస్తున్న అదనపు 50శాతం ఛార్జీలను రద్దు చేసి, ప్రయాణికులపై ఆర్థిక భారం తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందించిన వారిలో కూసుమంచి సర్పంచ్ కొండా కృష్ణవేణి మహిపాల్, వార్డు సభ్యులు చెరుకుపల్లి వీరయ్య, కొక్కిరేణి వెంకన్న, గంజి ఉదయ్‌కుమార్, పిట్టల వేణు, అడపా శివ, బద్దం వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రజావాణి, గిరిజన దర్బార్

**ప్రజాపక్షం/భద్రాచలం :** నేడు జిల్లా కలెక్టరేట్ సముదాయంతో పాటు భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి, భద్రాచలం ఐటిడిఏ సమావేశం మందిరంలో గిరిజన దర్బార్ నిర్వహించనున్నట్లు ఆయా కార్యాలయాల అధికారులు తెలిపారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే ప్రజల ఆయా సమస్యలపై వినతులు చేసేందుకు వస్తుంటారు. అధికారులంతా సకాలంలో హాజరు కావాలని తెలిపారు. అధికారులంతా ప్రజాసమస్యల పరిష్కారంలో శక్తివంచన లేకుండా పనిచేయాలని సూచించారు.

# భూసేకరణలో రెవెన్యూ మాయాజాలం



**-సర్వేలో అక్రమాలు.. నిర్వాసితుల్లో బినామీలు**
**-మధ్యవర్తుల దందా**

**ప్రజాపక్షం/మణుగూరు :** భూసేకరణలో రెవెన్యూ అధికారులు మసిబూసి మారేడు కాయ చేస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. సంబంధం లేని వ్యక్తులను నిర్వాసితులుగా చేర్చి నీకో సగం నాకో సగం అన్న రీతిలో వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. సింగరేణి సంస్థ మణుగూరు ఏరియాలో ఉపరితల బొగ్గుగని ఏర్పాటుకు సంబంధించి భూసేకరణ ప్రారంభించింది. ఈ భూ సేకరణలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రెండేళ్ల క్రితం ప్రారంభమైన భూసేకరణకు సంబంధించి 400 ఎకరాల్లో 400 మంది నిర్వాసితులు ఉంటారని తొలుత అంచనా వేశారు. రెండేళ్ల నుంచి మొదలైన నిర్వాసితుల సంఖ్య ఒక కొలిక్కి తీసుకు రాకపోవడంతో రోజు రోజుకు పెరుగుతుంది. ఇప్పటికే 1600 మంది నిర్వాసితులు ఉన్నట్లుగా రెవెన్యూ అధికారులు జాబితా సిద్ధం చేశారని సమాచారం. కొంత మంది దళారులు ఉపరితల గని ప్రాంతంలో ఉన్న భూములకు సంబంధించి క్రమ విక్రయాలు జరిగినట్లు నకిలీ పత్రాలను సృష్టించి లబ్ధిదారులుగా చేర్చారు. ఈ బినామీలలో ఒక్కొక్కరి నుంచి లక్షల్లో వసూళ్లు జరిగాయి. ఒక పక్క రాజకీయ అండ మరో పక్క మధ్యవర్తుల దందా నడుమ నకిలీ నిర్వాసితులకు జాబితాలో చోటు దక్కింది. భూసేకరణ సందర్భంగా రెవెన్యూ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా నిర్వాసితుల జాబితాను తయారు చేశారని పెద్ద ఎత్తున ఆరోపణలు వినవస్తున్నాయి. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు రూ. 40 కోట్ల వరకు అవినీతి చోటు చేసుకుందని సమాచారం. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి మణుగూరులో జరిగిన ఈ రెవెన్యూ బాగోతంపై విచారణ జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అసలైన నిర్వాసితులకు న్యాయం చేయాలని అవినీతికి కారుకులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం



**-నియోజకవర్గంలో పలు పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు**
**-రెండో పంట వేయొద్దని రైతులకు మంత్రి పొంగులేటి విజ్ఞప్తి**

**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రజా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యమిస్తూ పాలన సాగిస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌తో కలిసి పాలేరు నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఏదులాపురం మున్సిపాలిటీ 23వ వార్డులో రూ 2కోట్లతో నిర్మించనున్న గిరిజన భవనానికి, కూసుమంచి మండలం మంగళితండ నుంచి దుబ్బబండ వరకు రూ 1.63కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డుకు, జుజ్జుల్‌రావుపేటలో రూ 45లక్షలతో నిర్మించనున్న 100 కేఎల్ ఓహెచ్ఎస్ఆర్, పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. మంగళితండలో రూ 20లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయితీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం కూసుమంచి క్యాంపు కార్యాలయంలో మండలానికి చెందిన 30 మంది కళ్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణీతో పాటు పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో ప్రపంచ వ్యాప్తంగా తాగునీరు, విద్యుత్ కొరత సమస్యలు ఎదురవుతున్నాయని, విద్యుత్ లభ్యత తగ్గితే రైతులు ఇబ్బందులు పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. మొదటి పంటను కాపాడేందుకు ప్రభుత్వం అవసరరమైన చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. నీరు, విద్యుత్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని రైతులు రెండో పంట వేయవద్దని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి శ్రీనివాసరెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ యుగంధర్‌రావు, పంచాయితీ రాజ్ ఎస్ఈ వెంకట్‌రెడ్డి, విద్యాశాఖ ఈఈ బుగ్గయ్య, మిషన్ భగీరథ ఈఈ వాణిశ్రీ, హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాసష్, ఏదులాపురం మున్సిపల్ ఛైర్ పర్సన్ పోకబత్తిని అనిత, కూసుమంచి తహసీల్దార్ సైదులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నేడు వైరా మున్సిపల్ సమావేశం డౌటే నా?




**-పలుమార్లు వాయిదా.. కౌన్సిర్ల హాజరుపై ఉత్కంఠ!**
**-అధికార పార్టీలో అంతర్గత విభేదాలే కారణమా?**
**-సమావేశం సజావుగా సాగుతుందా... మరోసారి వాయిదా పడుతుందా?**

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీలో నేడు జరగాల్సిన సర్వసభ్య సమావేశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన సమావేశం ఈసారైనా జరుగుతుందా? పాలకవర్గ సభ్యులంతా హాజరవుతారా? లేక మరోసారి వాయిదా పడుతుందా? అన్న చర్చ పట్టణంలో జోరుగా సాగుతుంది. వైరా మున్సిపాలిటీ మొత్తం 20 మంది పాలకవర్గ సభ్యులు ఉండగా, సమావేశానికి ఎంతమంది హాజరవుతారన్నది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా అధికార కాంగ్రేస్ పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలు సమావేశంపై ప్రభావం చూపే అవకాశాలున్నాయనే చర్చ వినిపిస్తుంది. అధికార కాంగ్రేస్ పార్టీలో 12 మంది కౌన్సిలర్లు ఉండగా, ఒక సిపిఎం కౌన్సిలర్ ఉన్నారు. కాంగ్రేస్ పార్టీలోని కొందరు కౌన్సిలర్లు అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. సుమారు 8 మంది కౌన్సిలర్లు తమ సమస్యలను ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ దృష్టికి తీసుకెళ్లినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతుంది. చైర్‌పర్సన్‌కు కొద్దిమంది కౌన్సిలర్ల మద్దతు మాత్రమే ఉందన్న ప్రచారం కూడా వినిపిస్తుంది. అయితే ఈ వివరాలపై అధికారిక ధృవీకరణ రావాల్సి ఉంది. మున్సిపాలిటీలో నిర్ణయాలు తీసుకునే సమయంలో తోటి కౌన్సిలర్ల అభిప్రాయాలకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని కొందరు ప్రజాప్రతినిధులుఅభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. సమావేశాల ఎజెండా, అభివృద్ధి పనుల వివరాలు, అధికారుల నుంచి సమాచారం అందించే విధానం వంటి అంశాలు కూడా చర్చకు వస్తున్నట్లు తెలుస్తుంది.

### నిశితంగా గమనిస్తున్న ప్రతిపక్షాలు

అధికార పార్టీలో కొనసాగుతున్న పరిణామాలను ప్రతిపక్ష కౌన్సిలర్లు నిశితంగా గమనిస్తున్నారు. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య సమావేశంలో ఎలాంటి చర్చ జరుగుతుంది? ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులపై ఏ మేరకు నిర్ణయాలు తీసుకుంటారు?అన్నది ఆసక్తికరంగా మారింది.

### నేడు తేలనున్న ఉత్కంఠ!

పలుమార్లు వాయిదా పడిన వైరా మున్సిపల్ సమావేశం నేడు సజావుగా కొనసాగుతుందా? కౌన్సిలర్ల మధ్య విభేదాలు చర్చలకు దారితీస్తాయా? లేక మరోసారి వాయిదా పడుతుందా? అన్నది వేచిచూడాలి. ఏది ఏమైనా రాజకీయ పరిణామాలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారం, పట్టణ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై పాలకవర్గం దృష్టి సారించాలని పట్టణ ప్రజలు ఆశిస్తున్నారు.

# తలసేమియా చిన్నారుల బతుకమ్మ వేడుకలు





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో... బంగారు బతుకు ఇవ్వమ్మ ఉయ్యాలో అంటూ తలసేమియా చిన్నారులు ఆటపాటలతో సందడి చేశారు. ఆదివారం సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వైరా రోడ్డులోని రితన్య ఆసుపత్రి వద్ద తలసేమియా చిన్నారులు బతుకమ్మ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.చిన్నారులు, తల్లిదండ్రులు పూలను సేకరించి బతుకమ్మలను తయారు చేశారు. గౌరమ్మ, బతుకమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ఆడుతూ పాడుతూ తమకు బతుకునిస్తున్న రక్తదాతలను చల్లగా చూడమ్మ అంటూ గౌరమ్మను వేడుకున్నారు. ఎంతో ఉత్సాహంగా చిన్నారులు బతుకమ్మ ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. ఈ వేడుకల్లో డాక్టర్ డి. నారాయణమూర్తి, సంస్థ ఫౌండర్ అనిత, సంస్థ బాధ్యులు పొద్దుటూరి పావని, పి. ఉదయ్‌భాస్కర్, పి. రవిచందర్, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వాడవాడలా దుర్గాదేవికి పూజలు

**ప్రజాపక్షం/ఖమ్మం :** దేవీ నవరాత్రుల సందర్భంగా మండలం లోని వివిధ గ్రామాలలో ఆదివారం మండపాల వద్ద దేవి విగ్రహాల ఏర్పాటు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని డిజే, కోలాటం, నృత్యాలు, ఆటా, పాటలతో సందడి గా తీసుకొచ్చారు. వేదపండితుల మంత్రోచరణ నడుమ మండపం లో ప్రతిష్టించారు. మండలం లోని వాడ, వాడ న అమ్మవారి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాయగూడెం సర్పంచ్ బోయిన వేణు ఆధ్వర్యంలో కార్యక్రమం ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటి సభ్యులు కాళంగి గణేష్, వై.కృష్ణారావు, వి.నాగబాబు, ఎం.నాగబ్రహ్మం, కాళంగి అశోక్, కిరణ్, గోపి, కోల నాగేశ్వరరావు, ఇందిరా, మద్రబోయిన గోపి, ఉదయ్ శ్రీ, కోసూరిపానకాలు, కోసూరి రాజబాబు, బోయిన నాగరాణి, మాధవి, కోసూరిఅన్నపూర్ణ, తేనే రోజామణి, శ్రీనమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పొంగులేటిని కలిసిన మాజీ ఎంపీపీ



**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఆదివారం నేలకొండపల్లి మాజీ ఎంపీపీ, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొర్లకుంట నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అర్హులైన పేదలకు మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఇరగదిండ్ల నాగరాజు తదితరులు ఉన్నారు.

# రంజాన్ షెడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని కూరగాయల మార్కెట్ సమీపంలోని మసీదు వద్ద రూ.6 లక్షల వ్యయంతో నిర్మించిన రంజాన్ షెడ్డు ను పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి, వారి సౌకర్యార్థం నిధులు కేటాయిస్తూ అభివృద్ధికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ముస్లిం సోదరులకు ఉపయోగకరంగా ఉండేలా రంజాన్ షెడ్డు నిర్మాణం చేపట్టడం సంతోషకరమని తెలిపారు. అన్ని మతాలు, అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, మణుగూరు మున్సిపాలిటీతో పాటు పినపాక నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ అధ్యక్షులు రహీం పాషా, మండల అధ్యక్షులు, పిరినాకి నవీన్ టౌన్ అధ్యక్షులు కురం రవి ముదిరాజ్, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, మైనారిటీ సోదరులు, మహిళా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ లక్ష్మణరావుకు మాతృవియోగం

**ఫోన్‌లో పరామర్శించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**ప్రజాపక్షం/ఖమ్మం :** భైరవునిపల్లి గ్రామ సర్పంచ్ గుండపనేని లక్ష్మణరావు కుటుంబంలో విషాదం నెలకొంది. ఆయన మాతృమూర్తి గుండపనేని కమలమ్మ (85) ఆదివారం తుదిశ్వాస విడిచారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. సర్పంచ్ మాతృమూర్తి మృతి విషయం తెలుసుకున్న రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఫోన్ ద్వారా లక్ష్మణరావును పరామర్శించి ఓదార్చారు. కమలమ్మ మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కమలమ్మ పార్థివ దేహాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, నెల్లూరి భద్రయ్య, గ్రామ పెద్దలు కనకబండి సీతారాములు, పోలంపల్లి జాన్, కనకబండి రామయ్య, పోలంపల్లి వెంకట్ పిచ్చయ్య, మల్లెబోయిన శ్రీనివాసరావు తదితరులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతురాలికి ఐదుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆమె మృతి పట్ల గ్రామంలో పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

# ఆధ్యాత్మిక భావనతో మానసిక ప్రశాంతత

**- అమ్మవారి కటాక్షంతో సుఖసంతోషాలు**
**- భక్తులకు అసౌకర్యం కలగొద్దు**
**- ఉత్సవాలు విజయవంతం చేయాలి**





**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** అమ్మవారి కరుణాకటాక్షాలతో ప్రజలంతా సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ మండలంలోని కేపి జగన్నాధపురం గ్రామంలో ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెద్దమ్మతల్లి దేవస్థానంలో ఆదివారం దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిథిగా విచ్చేసిన ఎంఎల్ఏ కూనంనేనికి ఆలయ అర్చకులు పూర్ణకంభంతో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం జ్యోతిప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పండుగలు, ఆధ్యాక్మిక భావన సమాజంలో మానసిక ప్రశాంతతను నింపుతాయన్నారు. తొమ్మిది రోజులపాటు జరిగే ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు క్యూలైన్లు తాగునీరు ప్రసాదాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటి ఏర్పాట్లు చేయాలని, ఉత్సవాలు ప్రశాంతంగా సాగేందుకు ప్రతొక్కరు సహకరించాలని కోరారు. అనంతరం అర్చకులు ఆయనకు వేదాశీర్వచనాలు ఇచ్చి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా మేయర్ మూడ్ గణేష్ సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాధం, ఆలయ ఇఓ విజయ్ కుమార్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా వీశంశెట్టి పూర్ణచందర్ రావు ఉప్పుశెట్టి రాహుల్ జిల్లా సమితి సభ్యులు డి సుధాకర్ వీశంశెట్టి విశ్వేశ్వరరావు నిమ్మల రాంబాబు వీ పద్మజ నాయకులు శనగారపు శ్రీనివాసరావు బివి సత్యనారాయణ, బోనోత్ రవి రంజిత్ గొర్లె నరేష్ సక్రు, రాందాస్, కిరణ్ కుమార్, అల్లి వెంకటేశ్వర్లు సంజీవరావు రామారావు కాంగ్రెస్ నాకులు కొండ వెంకన్న మహిపతి రామలింగం బాలినేని నాగేశ్వర రావు గంధం నరసింహారావు బార్ల జోషి తదితరులు పాల్గొన్నారు.

# యువత, విద్యార్థులపై ప్రభుత్వ దాడి అమానుషం

**-ఓట్ల దొంగకు బుద్ధి చెప్పాల్సిందే**
**-సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా**




**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రజాస్వామ్యంలో అత్యంత కీలక భూమిక పోషించాల్సిన ఎన్నికల కమిషన్ బిజెపికి తొత్తుగా మారడాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టిన విద్యార్థులు, యువతపై ప్రభుత్వ దాడి అమానుషమని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా తెలిపారు. ప్రజా పోరాటాలు, ఆందోళనలు జరుగుతున్నప్పుడు డిమాండ్‌పై ప్రభుత్వం ఆలోచన చేయాలని వీలైనంత మేర ప్రజల డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రయత్నించాలి తప్ప అరెస్టులు, లాఠీచార్జీలతో అణిచివేయడం సరి కాదని ఆయన తెలిపారు. ఇన్సాఫ్ ఖమ్మం నగర కమిటీ సమావేశం ఆదివారం స్థానిక సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. ఎస్కె సైదా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మౌలానా మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం గతంలో ఎన్నో ఆశలు చూపి అధికారంలోకి వచ్చిందని ఆ తర్వాత మతాన్ని బూసిగా చూపి లబ్ది పొందిందని ఇప్పుడు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయి చివరకు ఓట్లను చోరీ చేస్తూ రాజకీయ పార్టీలను చీలుస్తూ అధికారంలో కొనసాగుతుందన్నారు. ప్రజలను మరిచి పాలన సాగిస్తున్న బిజెపి పాలనపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని ఇక బిజెపి తల వంచక తప్పదన్నారు. గతంలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని ఇప్పుడు ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ కూడా రాజీనామా చేయక తప్పదని మౌలానా హెచ్చరించారు. ఢిల్లీలో పోలీసులతో పాటు ఆర్ఎస్ఎస్, విశ్వ హిందూ పరిషత్‌కు చెందిన గుండాలు సైతం యువత, విద్యార్థులపై దాడి చేస్తున్నారని ఇందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

**పోరాటాలకు సిద్ధం కండి :**

ముస్లిం మైనార్టీలు తమ హక్కుల సాధన కోసం పోరాటాలకు సిద్ధం కావాలని ఇన్సాఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మహ్మద్ సలాం కోరారు. పోరాడకుండా ఏ హక్కులు రావని ఆయన స్పష్టం చేశారు. ఇన్సాఫ్ నగర మహాసభలో మాట్లాడుతూ పాలకులు ఎవరైనా ముస్లిం మైనార్టీలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో వివక్ష చూపుతున్నారని ఆయన ఆరోపించారు. వక్ఫ్ భూములకు రక్షణ లేకుండా పోయిందని, మైనార్టీ మెజార్టీ ప్రాతిపదికన పాలకులు వ్యవహరించడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని హామీల అమలుకు పోరాటానికి సిద్ధం కావాలన్నారు. ఇన్సాఫ్ మహాసభలో సిపిఐ నగర కార్యదర్శి ఎస్కె జానిమియా, ప్రజా సంఘాల నాయకులు యానాలి సాంబశివరెడ్డి, వరదా నర్సింహారావు, ఎండి జాకీర్, యాకూబ్ మహ్మద్, మాసివుద్దీన్, చానా, యుసూఫ్, రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

# క్లర్క్‌గా చేరి.. క్లర్క్‌గానే రిటైర్డ్ కావాలా..?

**-క్యాడర్ స్కీమ్ సవరణ కోసం త్వరలో ఉద్యమ కార్యాచరణ**
**- ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్**




**ప్రజాపక్షం/చుంచుపల్లి:** సింగరేణి సంస్థలో ఉన్నత విద్యార్హతలు, సుదీర్ఘ అనుభవం ఉన్నప్పటికీ పదోన్నతులు కల్పించకుండా ఉద్యోగులను క్లర్కులుగానే పదవీ విరమణ చేయించడం అన్యాయమని ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్ అన్నారు. సెక్రెటేరియల్ సిబ్బంది సమస్యల పరిష్కారం, క్యాడర్ స్కీమ్ సవరణ, పదోన్నతుల కల్పన తదితర డిమాండ్ల సాధన కోసం త్వరలో ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని ప్రకటించారు. ఆదివారం కొత్తగూడెంలోని ఆర్‌సీఓఏ క్లబ్‌లో కొత్తగూడెం రీజియన్ పరిధిలోని కార్పొరేట్, సత్తుపల్లి, మణుగూరు, ఇల్లందు ప్రాంతాల క్లరికల్ ఉద్యోగుల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, హెచ్ఎంఎస్, బీఎంఎస్, సీఐటీయూ నాయకులు పాల్గొని ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వంగ వెంకట్ మాట్లాడుఊ సింగరేణిలో అమలవుతున్న క్యాడర్ స్కీమ్‌ను ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా సమీక్షించి సవరించాలని కోరారు. పీఏలు, ఓఎసక్షలకు తగిన పదోన్నతులు కల్పించి ఎగ్జిక్యూటివ్ క్యాడర్‌లోకి తీసుకోవాలని, ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ప్రతిభను గుర్తించి, వారి అర్హతలకు అనుగుణంగా ఉన్నత స్థాయి అవకాశాలు కల్పించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై యాజమాన్యం సానుకూలంగా స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఈ సదస్సులో ఏఐటీయూసీ కార్పోరేట్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్.వి.రమణమూర్తి, కార్పోరేట్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు క్రిస్టోఫర్, ఆఫీస్ బేరర్లు నాగయ్య, మల్లికార్జున్, మధుకృష్ణ తదితరులు పాల్గొన్నారు. సికా నాయకులు నామా శ్రీనివాస్, రామ్‌సింగ్, రాజు, శ్యాం కిరణ్, సంజీవ్, రమణ, దివ్య, సౌజన్యతో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు హాజరై సమస్యల పరిష్కారం, పదోన్నతుల విధానం, క్యాడర్ స్కీమ్ సవరణపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

# ఘనంగా దేవీ శరన్నవరాత్రోత్సవాలు





**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** దేవీ శరన్నవరాత్రోత్సవాలు మండల వ్యాప్తంగా ఘనంగా ఆదివారం ప్రారంభమయ్యాయి. నవరాత్రుల సందర్భంగా పలు గ్రామాల్లో ఆలయాలు, పలు వీధుల్లో మండపాలను నిర్మించి అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేశారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ప్రతి రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు, లలితా సహస్రనామార్చన, హోమాలు నిర్వహించనున్నారు. నవరాత్రుల సందర్భంగా తొలి రోజు విగ్రహ దాతలు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పూజ అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు అందజేయనున్నారు. దేవీ నవరాత్రోత్సవాలతో పాటు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆట పాటలతో గ్రామాల్లో సందడి నెలకొంది. వి. వెంకటాయ పాలెం గ్రామంలో రామాలయంతో పాటు బొడ్రాయి సెంటర్, పలు ప్రాంతాలలో నవరాత్రోత్సవాల సందర్భంగా అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు.

# నవంబర్ 14 నుండి నెహ్రూ క్రికెట్ కప్ టోర్నమెంట్

**ప్రజాపక్షం/భద్రాచలం :** నవంబర్ 14 నుంచి 30 వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైధానంలో నెహ్రూక్రికెట్ కప్ టర్నోమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం జరిగిన సమావేశంలో తోటమల్ల బాలయోగి వాతాడి దుర్గా అశోక్ మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. 1994లో మొదలైన నెహ్రూ క్రికెట్ కప్ ఇప్పుడు 30వ ఏటా అడుగు పెట్టిందన్నారు. ఇన్నేళ్ల పాటు పలు ప్రాంతాల నుండి క్రికెటర్లు వచ్చి ఈ క్రీడామైధానంలో జరిగే టోర్నమెంట్‌లో పాల్గొంటున్నారని చెప్పారు. ఈ ఏడాది విన్నర్స్‌కు 60 వేలు, రన్నర్స్‌కు రూ.40 వేలతో పాటు ట్రోపీలు, వ్యక్తిగత అవార్డులు అందజేయడం జరుగుతుందన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న జట్లు 9440101108 నెంబర్‌కు వివరాలు వాట్సాప్ ద్వారా పంపించాలని తెలిపారు. ఈ టోర్నమెంట్‌కు గౌరవ చైర్మన్‌గా పాకాల దుర్గాప్రసాద్, గౌరవ అధ్యక్షులుగా ఎస్కే అజీమ్, గౌ సలహా దారునిగా ఉడతా రమేష్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా అట్లూరి శ్రీధర్, కన్వీనర్‌గా ఎస్కే సలీమ్, కార్యదర్శిగా ఎం నాగార్జున, కోశాధికారిగా కుంచాల సదానందం వ్యవహరిస్తారని చెప్పారు.

# తెలంగాణ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు



**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కంటే రాజకీయ ప్రచారానికే ప్రజాధనాన్ని ఎక్కువగా వాడుతోందని కరకగూడెం బీజేపీ మండల అధ్యక్షుడు జుజ్జూరి నరేష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన స్మార్ట్ (పీవీసీ) రేషన్ కార్డుల ముద్రణ, పంపిణీ తీరుపై ఆయన విస్మయం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో ఇస్తున్న బియ్యాన్ని తామే ఇస్తున్నట్లుగా ప్రజలను తప్పుదారి పట్టిస్తూ ప్రచారం చేసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరి మార్చుకుని, రేషన్ దుకాణాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలకు, ప్రధానమంత్రికి తగిన ప్రాధాన్యం, గౌరవం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రతినిధి శ్రీరామచంద్రయ్య, పార్టీ నాయకులు పూణెం శంకరయ్య, పోలబోయిన కృష్ణ, జాడి సమ్మయ్య, నందిగామ ప్రసాద్ చారి, బొల్లికొండ రవికిరణ్, గొగ్గల శ్రీను, సత్యం, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# ఘనంగా రెండో రోజు బతుకమ్మ వేడుకలు



**ప్రజాపక్షం/ఖమ్మం :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు సుజాతనగర్‌లోని 21వ డివిజన్ సుందరయ్య నగర్ కాలనీలో రెండో రోజు ఘనంగా జరిగాయి. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మ పాటలు పాడుతూ, బతుకమ్మల చుట్టూ చేరి ఆనందోత్సాహాల మధ్య సంబరాలు జరుపుకున్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, వాటి చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మహిళల కోలాహలం, బతుకమ్మ పాటలతో సుందరయ్య నగర్ కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది. సుజాతనగర్ 21వ డివిజన్ సుందరయ్య నగర్ కాలనీలో రెండో రోజు బతుకమ్మ వేడుకలు సంప్రదాయ వైభవాన్ని చాటుతూ ఆనందోత్సాహాల మధ్య కొనసాగాయి.

# ఖమ్మం గడ్డపై కొలువుదీరనున్న తిరుమలేశుడు






**-20 ఎకరాల విస్తీర్ణంలో టిటిడి దివ్యక్షేత్రం**
**-ఆధ్యాత్మిక నగరంగా ఖమ్మం**
**-నేడు ఆలయ నిర్మాణానికి భూమిపూజ**
**-సకల జనులు హాజరు కావాలి : మంత్రి తుమ్మల**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి దివ్య ఆశీస్సులతో ఖమ్మం నగర చరిత్రలో మరో సువర్ణధ్యయం ఆవిష్కృతం కానుంది. ప్రఖ్యాత తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలో ప్రతిపాదిత శ్రీ వెంకటేశ్వర స్వామి దివ్యక్షేత్ర నిర్మాణానికి నేడు (సోమవారం) శంకుస్థాపన మహోత్సవం (భూమిపూజ) అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. కొత్తగూడెం అల్లిపురం రోడ్డులో నిర్మించనున్న ఈ ఆలయం ఖమ్మం ఆధ్యాత్మిక వైభవానికి మణిహారంగా నిలవనుంది.

### 20 ఎకరాల విస్తీర్ణంలో ఆలయ నిర్మాణం :

భక్తుల ఆధ్యాత్మిక అవసరాలు, అగమశాస్త్ర నియమాలకు అనుగుణంగా మొత్తం 20 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో ఈ దివ్యక్షేత్రం రూపుదిద్దుకోనుంది. ఈ ప్రాంగణంలో ప్రధాన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంతో పాటు, శ్రీ పద్మావతి అమ్మవారు, శ్రీ ఆండాళ్ అమ్మవార్ల ఉప ఆలయాలు, శోభయమానమైన మూడంతస్తుల రాజగోపురాలు, భక్తులు ప్రదక్షిణలు చేసుకునేందుకు నాలుగు మాడ విధులు, పవిత్ర స్వామి వారి పుష్కరిణి, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు కోసం ప్రత్యేక వాహన మండపం ఏర్పాటు చేయనున్నారు.

### భక్తులకు సకల సదుపాయాలు :

కేవలం దర్శనమే కాకుండా తిరుమల తరహా అనుభూతిని అందించేలా ఆధునాతన మౌలిక వసతులు కల్పించనున్నారు. యాత్రికుల నిరీక్షణ మందిరాలు (వేయిటింగ్ హాల్స్), నిత్యాన్నదాన సముదాయం, వసతి గదులు, డార్మెటరీలు, విశాలమైన వాహన పార్కింగ్, షూ కీపింగ్ కౌంటర్లు, పారిశుధ్య సముదాయాలను నిర్మించనున్నారు. అలాగే ఆలయ అర్చకులు, సిబ్బంది నివాసాలు, పరిపాలన కార్యాలయ భవన నిర్మాణాలను మాస్టర్ ప్లాన్‌లో చేర్చారు. ఈ క్షేత్రం కేవలం ఆలయం మాత్రమే కాదని ఖమ్మం ప్రజల దశాబ్దాల ఆధ్యాత్మిక స్వప్న సహకారమని సొసైటీ ఛైర్మన్ రావూరి సైదుబాబు, మాజీ కార్పొరేటర్ రావూరి కరుణ తెలిపారు. శ్రీవారి దర్శన భాగ్యం, మానసిక ప్రశాంతత భక్తులకు మెరుగైన వసతులు ఒకే ప్రాంగణంలో అందుబాటులోకి రావడం శుభపరిణామమన్నారు. ఆలయ నిర్మాణం కోసం కృషి చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు, భూమి కేటాయించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, టిటిడి ఆధ్వర్యంలో ఆలయ మంజూరుతో పాటు నిధులు కేటాయించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడుకు ఖమ్మం నగర ప్రజల తరుపున వారు కృతజ్ఞతలు తెలిపారు.

హోమాలు, ప్రత్యేక పూజలు

### సకల జనులు హాజరు కావాలి : మంత్రి తుమ్మల

తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మించనున్న కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ శంకుస్థాపన మహోత్సవం సందర్భంగా ఆదివారం హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహించారు. భగవత్ ప్రార్థన, సూక్త పఠనం, విశ్వక్సేనారాధనం, పుణ్యాహవాచనం, పంచగవ్యారాధన, ఆచార్యవరణం, మృత్సంగ్రహణ, అంకురారోపణ, వాస్తుదేవతా బలిహరణం, వాస్తు హోమం, అకల్మష హోమం, రక్షాబంధనం, చతుర్వేదశిల శుద్ధి, పంచాగ్ని ప్రణయమం, ప్రధాన కుంభాసాధనం,ఉత్సవమూర్తులకు విశిష్ట అర్చన, రత్నానాం చతుర్వేద శిలానాం, ధాన్యాధివాసం, ప్రధానహోమం, పంచాగ్ని షుక్తహోమం, మహాశాంతి హోమం, నీరాజన తీర్థ గోష్టి తదితర పూజలను వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ, భక్తజన సందోహం మధ్య వైభవంగా నిర్వహించారు. ఈ ప్రత్యేక హోమం, పూజా కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్, ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శంకుస్థాపన మహోత్సవ కార్యక్రమానికి సకల జనులు హాజరు కావాలని సూచించారు. భూమిపూజకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. టిటిడి ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా ఈ భూమిపూజ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు తుమ్మల యుగంధర్, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, సొసైటీ ఛైర్మన్ రావూరి సైదుబాబు, మాజీ కార్పొరేటర్ రావూరి కరుణ, రాయల నాగేశ్వరరావు, నాగండ్ల దీపక్ చౌదరి, దొబ్బల సౌజన్య, పలువురు నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# వివాదాల్లో స్పైసీ రెస్టారెంట్

**- నాణ్యతపై అనుమానాలు**
**- సామాజిక మాద్యమాలలో చక్కర్లు**
**- ఎస్‌పి కి ఫిర్యాదు ?**




**ప్రజాపక్షం/పాల్వంచ :** ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పేరుగాంచిన పాల్వంచ పట్టణంలోని స్పైసీ హోటల్‌పై పలు ఆరోపణలు రావటంతో అసలు రెస్టారెంట్‌లో ఏమో... జరుగుతున్నదని పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఫైవ్ స్టార్ హోటల్‌కు ధీటుగా సామాన్యులకు అందుబాటు ధరలో బిర్యానితో పాటుగా అన్ని రకాల వంటకాలను రుచికరంగా, శుచికరంగా అందజేస్తూ ఏవన్‌గా పేరుపొందిన స్పైసీ హోటల్ యాజమాని తీరుతో రెస్టారెంట్ వివాదాల సుడిగుండంలో చిక్కుకొందని పలువురు అంటున్నారు. గత కొద్ది రోజుల కిందట హోటల్‌లో పని చేస్తున్న సరఫరా చేసే వ్యక్తి ఆకలిగా ఉందని భోజనం చేస్తుండగా కోపోద్రిక్తుడైన రెస్టారెంట్ యాజమాని పని పనిషిపై దాడి చేశారని, నిల్వ చేసిన ఆహార పథార్ధాలను మరుసటి రోజు కస్టమర్లకు అందిస్తూ మోసానికి పాల్పడుతున్నారని హోటల్ యాజమానిపై పాల్వంచ కేంద్రంగా కొనసాగుతున్న పలు సామాజిక మాద్యమాలలో (వాట్సాప్) గ్రూపుల్లో ఆరోపణలు గుప్పిస్తూ పోస్టులు చెక్కర్లు కొట్టాయి. వివాదం కాస్తా పోలీస్ స్టేషన్‌కు చేరిందని తెలుస్తోంది. అనంతరం తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు, బాదితుడి బందువులు హోటల్ ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేయటంతో హోటల్ నమ్మకంపై ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హోటల్ నాణ్యతపై పలు ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా నాణ్యతకు మరోపేరులా నిలిచి ప్రజల మన్ననలు పొందుతున్న స్పైసీ రెస్టారెంట్ నాణ్యతపై నీలి నీడలు అలుముకొంటున్నాయని తెలుస్తోంది. హోటల్‌లో అందజేస్తున్న ఆహార పధార్ధాల నాణ్యత పరిశీలించాలని, బాదితుడికి న్యాయం చేయాలని జిల్లా పోలీస్ బాస్‌కు ఫిర్యాదు చేశారని తెలుస్తోంది. తన హోటల్ ద్వారా ఎంతో మందికి ఉపాధిని అందిస్తున్న రెస్టారెంట్ యాజమాని పని చేసే వ్యక్తిపై దాడి చేశారని ఆరోపణలు రావటం నిజం కాకపోయి ఉండచ్చని పలువురు చర్చించుకోవటం కొసమెరుపు.

# శ్రీ వెంకటేశ్వర స్వామి భూమిపూజ కార్యక్రమానికి భారీగా తరలిరండి




**ప్రజాపక్షం/ తల్లాడ :** ఖమ్మంలో కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ నిర్మాణానికి సంబంధించి ఈనెల 12న సోమవారం భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండల అధ్యక్షులు గొడుగునూరి లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. భూమిపూజకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ భూమి పూజ కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించడం జరుగుతుందన్నారు. భూమిపూజ కార్యక్రమానికి మండలం నుంచి అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి ఆశీస్సులు పొందాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియన్ నాయకులు, మండల ముఖ్య నాయకులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీలకు సన్మానం




**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నూతన కమిటీలకు సత్తుపల్లి శాసన సభ్యురాలు మట్టా రాగమయి దయానంద్ ఆదేశాల మేరకు తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొడుగునూరు లక్ష్మారెడ్డి, మండల కమిటీ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనుబంధ కమిటీలు ఎన్నికైన అధ్యక్షులను శాలువలతో ఘనంగా సన్మానించారు. పార్టీ హై కమాండ్ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరు కాంగ్రెస్ పార్టీ నిర్ణయానికి కట్టుబడి పనిచేయాలన్నారు. గ్రామ స్థాయి నుండి పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో తల్లాడ మండల సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, జిల్లా కమిటీ ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు, మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ బిసి సెల్ మండల అధ్యక్షునిగా రాము



**ప్రజాపక్షం/ తల్లాడ :** కాంగ్రెస్ పార్టీ బిసి సెల్ తల్లాడ మండల అధ్యక్షులుగా తల్లాడ పట్టణానికి చెందిన కోడూరు రాము ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో రామును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మక ం ఉంచి ఈ పదవి ఇచ్చినందుకు మండలంలో పార్టీ బలోపేతం, బిసి ఐక్యత కోసం కృషి చేస్తానని తెలిపారు. తనకు అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.